
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 18.0




పాలకొల్లులో మెడికల్ ల్యాబ్ తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

పాలకొల్లులో ప్రైవేటు ల్యాబ్‌ల తనిఖీలు

-ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్-

పాలకొల్లు రూరల్, జనవరి, 8 పాలకొల్లు అర్బన్ ఏరియాలో ప్రైవేటు ల్యాబ్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు సోమవారం తనిఖీలు చేశారు. గత నెల 25న 'పుట్టగొడుగుల్లా మెడికల్ ల్యాబ్‌లు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. దీంతో ల్యాబ్‌లను తనిఖీ నిర్వహించి వివరాలను సేకరించారు. పాలకొల్లు విజయ ల్యాబ్‌లో రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్‌లు, చేస్తున్న పరీక్షలు, ధరల పట్టిక పరిశీలించారు. సిబ్బంది విద్యార్హతలను ఆరా తీశారు. ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ తప్పనిసరి అన్నారు. ల్యాబ్ టెస్టుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే ప్రత్యేక టీమ్ ద్వారా పరిశీలనలు చేసి నోటీసులు జారీ చేసి మూసివేస్తామన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు అడ్డాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎంఆర్‌కె.రాజు తదితరులు పాల్గొన్నారు.


కోడిపందాలు, జూదాలు నేరం అని బ్యానర్ కడుతున్న పోలీసులు

కోడిపందాలు, జూదాలకు దూరంగా ఉండండి : ఎస్పీ

భీమవరం రూరల్ సర్కిల్ పరిధిలో 235 మంది బైండోవర్

భీమవరం క్రైం, జనవరి 8 : సంక్రాంతి పండుగ దృష్ట్యా కోడిపందాలు, పేకాట, జూదాలను అరికట్టేందుకు భీమవరం రూరల్ సర్కిల్ పరిధిలో 235 మంది బైండోవర్ చేసినట్లు జిల్లా ఎస్పీ రవిప్రకాశ్ తెలిపారు. భీమవరం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యకిషోర్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ, వీరవాసరం ఎస్ఐ, పాలకోడేరు ఎస్ఐలు కోడికత్తులు కట్టే 14 మందిని, జూదంలో అలవాటుపడిన నేరస్తులను 197 మందిని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశారు. ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహించినట్లయితే 94407 96645 నంబర్‌కు తెలియజేయాలని సీఐ కోరారు.



నేత్రపర్వం..కాళ్ళకూరు వెంకన్న పుష్పోత్సవం

కాళ్ళ, జనవరి 8 : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్షతులసీ పూజ, అమ్మవార్లకు లక్ష కుంకుమ పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఆస్థాన వేదపండితుడు అనిపెద్ది ఫణికుమార్‌శర్మ, ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. 400 కేజీల 16 రకాల సుగంధ పరిమళ పుష్పాలతో స్వామివారికి అర్చన నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈవో మోకా అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

అర్చనకు వినియోగించిన వివిధ రకాల పుష్పాలు



జిల్లాకు మంత్రి వస్తున్నారంటే ఆడంబరం. శంకుస్థాపన చేస్తే నియోజకవర్గానికే గౌరవం. మంత్రి శాఖ ద్వారా నిధులు రాబొట్టుకోవచ్చన్న భరోసా. శాసన సభ్యులు కూడా మంత్రు లను ఆహ్వానించడంలో పోటీ పడేవారు. జిల్లాకు వస్తే ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించేవారు. అవసరమైన ప్రతిపాదనలు చేయాలంటూ దిశానిర్దేశం చేసేవారు. ఇదంతా గతం.. ఇప్పుడంతా రివర్స్. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రుల జాడే లేదు.



అమాత్యా ! ఎక్కడ ?

బయటకు రాని మంత్రులు

- నియోజకవర్గాలకే పరిమితం
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు లేవు
- గతంలో మంత్రులు వస్తే ఘనం
- నిధులు ఇస్తారన్న భరోసా
- ఇప్పుడు అంతా బటన్ నొక్కుడే

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మంత్రులకు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయింది. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా దాదాపు నియోజకవర్గాలకే పరిమితం అవుతున్నారు. ఇతర శాఖల మంత్రులు జిల్లాకు రావడం బహు అరుదు. మంత్రులను ఆహ్వానించే పరిస్థితులు కూడా లేవు. గతంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా ఉండేవి. మంత్రులను పిలిచి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించే ఆనవాయితీ ఉండేది. ఆ క్రమంలోనే ఆయా శాఖల మంత్రుల నుంచి నిధులు ఇవ్వాలంటూ స్థానిక శాసన సభ్యులు కోరేవారు. నిధులు రాబట్టుకునేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అటువంటి సందడి ఎక్కడా లేదు. గడచిన నాలుగున్నరేళ్లలో జిల్లాకు మంత్రులు వచ్చిన దాఖలాలు చాలా అరుదు. జిల్లా అభివృద్ధి మండలి సమీక్షకు ఇన్‌చార్జ్ మంత్రి మాత్రం హాజరవుతున్నారు.

అభివృద్ధి పనులు ఉంటేగా !

గతంలో ఆధునికీకరణ పనులతో నీటి పారుదల శాఖ నిత్యం బిజీగా ఉండేది. ఏదో ఒక పని జరుగుతుండేది. పనుల పరిశీలనకు , కొత్త పనుల ప్రారంభోత్సవానికి నీటి పారుదల శాఖ మంత్రిని రప్పించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్కసారి కూడా నీటి పారుదల శాఖ మంత్రి అధికారిక పర్యటన చేయలేదు. పంచాయతీ రాజ్ శాఖదీ అదే పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి అంతా పంచాయతీ రాజ్ శాఖపై ఉంటుంది. నిధులు మంజూరులో ఆ శాఖ కీలకంగా వ్యవహ రిస్తుంది. ప్రస్తుత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించిన సందర్భాలు లేవు. ఉపాధి హామీ నిధులంటూ ఇళ్లకు కేటాయిస్తున్నారు. రహదారుల అభివృద్ధిని విస్మరించారు. దాంతో పంచాయతీ రాజ్ మంత్రి అవసరం లేకుండా పోయింది. అందుకే ఆయనను కూడా జిల్లాకు ఆహ్వానించిన దాఖలాలు లేవు. జిల్లా స్థాయిలో సమీక్షలు లేవు. కొత్త ప్రతిపాదనలు అంతకన్నా లేవు. నిధులు మంజూరు చేసినా పనులయ్యే పరిస్థితి లేదు. జిల్లాకు ఇన్‌ఛార్జ్ మంత్రిగా దాడిశెట్టి రాజా ఉన్నారు. జిల్లా అభివృద్ధి మండలి సమీక్షకు హాజరవుతున్నారు. ఒక దశలో ఆయనకే జిల్లా నేతలు ప్రశ్నలు కురిపించారు. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వస్తే రహదారులు పరిస్థితి ఏమిటో అర్థమవుతందంటూ ఆర్అండ్‌బీ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిని ఉద్దేశించి సమీక్షలోనే చురక లంటించారు. ఎన్నికల ఏడాది కావడంతో ఇటీవల ఆర్అండ్‌బీలో కొద్దిపాటి నిధులు మంజూరు చేశారు. టెండర్‌లు ఖరారు చేశారు. సుమారు 25 పనులకు టెండర్‌లు ఖరారైతే ప్రస్తుతం 5 పనులు మాత్రమే ప్రారంభానికి నోచుకున్నాయి. బకాయి బిల్లులను మంజూరు చేస్తేనే పనులు ప్రారంభిస్తామంటూ కాంట్రాక్టర్‌లు భీష్మించారు. దాంతో పనులు కూడా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పేరుకే మంత్రులు ఉంటున్నారు. నిధులు మంజూరు చేయ లేక సతమతమవుతున్నారు. జిల్లాలోనే పౌర సరఫరాల శాఖ మంత్రి ఉన్నాసరే ధాన్యం కొనుగోలుకు సక్రమంగా సంచులు పంపిణీ చేయలేకపోతున్నారన్న అపవాదు ఉంది. ధాన్యం కొనుగోలులోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అన్ని శాఖల మంత్రులకు నిధులు లేమి వెంటాడుతోంది. అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చే పరిస్థితి లేదు.

ముఖ్యమంత్రి శంకుస్థాపనలకే దిక్కులేదు

జిల్లాలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన పనులకే దిక్కు లేకుండా పోయింది. మెడికల్ కళాశాల, వాటర్‌గ్రిడ్ పనులు ముందుకు సాగడం లేదు. నర్సాపురం నియోజకవర్గం లోనూ, గణపవరంలో సబ్‌స్టేషన్‌లకు ముఖ్యమంత్రి శంకు స్థాపన చేశారు. వాటి పనులే ఇప్పటివరకు ప్రారంభించలేదు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలకే మన్నన లేకుండా పోయింది. ఇక మంత్రులను ఆహ్వానించే అవసరం ఏముందన్న పరిస్థితులో జిల్లా నేతలు మిన్నకుండిపోతున్నారు.

నిరసన గళం

అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళన

- సమ్మె నోటీసులిచ్చిన 108,104 సిబ్బంది
- అంగన్‌వాడీ ఉద్యమంపై ప్రభుత్వ నిఘా
- ఎస్మా ప్రయోగానికి చర్యలు..వివరాల సేకరణ
- విజయవాడ ధర్నాకు హాజరు కాకుండా యూటీఎఫ్ నాయకులపై పోలీసు నిర్బంధం

భీమవరం, జనవరి 8 : అంగన్‌వాడీ ఉద్యమంపై ప్రభుత్వం నిఘాపెంచింది. ఉద్యమ కారుల సంఖ్య, ఆందోళన తీరుపై సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. రెండురోజులుగా నిఘా శాఖ, జిల్లా ఉన్నతాధికారులు సమాచారం సేకరిస్తున్నారు. వీరికి నోటీసులు జారీ చేయనున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో నూరుశాతం సమ్మెలో ఉన్నారు. అంగన్ వాడీకేంద్రాలు జిల్లాలో 1523 ఉండగా టీచర్లు 1,540, మినీ టీచర్లు75, సహాయకులు 1,541 మంది సమ్మెలో ఉన్నారు. అంగన్వాడీలు సమ్మె విరమించి 5వ తేదీ నుంచి విధుల్లో చేరకుంటే నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టనున్నట్టు కలెక్టర్ ప్రశాంతి ద్వారా ఇంతకుముందే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా ఉద్యమం ఆపలేదు. ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసి సోమవారం నాటికి మూడు రోజులెంది. అంగన్వాడీలు గత నెల 12 నుంచి సమ్మె చేపట్టగా నేటికి 28 రోజులవుతోంది. ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకుని తెరిపించింది. ఇది ఫలితం ఇవ్వకపోవడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో అంగ న్వాడీ కేంద్రాలను నిర్వహించాలని ప్రయత్నించి మరోమారు విఫలమైంది. తాజాగా కలెక్టర్ల ద్వారా అల్టిమేటం జారీ చేయించి నప్పటికీ ఫలితం లేక పోయింది. దీంతో ఎస్మా చట్టంతో అణచి వేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. హెచ్చరికలు, పోలీసుల దౌర్జన్యాలతో ఉద్యమాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం యత్నించడం సరికాదని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు.

యూటీఎఫ్ నాయకులపై పోలీసు నిర్బంధం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 8 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్రప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ రాష్ట్రశాఖ ఇచ్చిన పిలుపు మేరకు మంగళ, బుధవారాల్లో విజయవాడలో నిర్వహించనున్న 36 గంటల ధర్నాను భగ్నం చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. యూటీఎఫ్ శ్రేణులు విజయవాడ ధర్నాకు హాజరుకాకుండా నిలువరించేందుకు ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ సీఆర్పీసీ సెక్షన్ 149 కింద సోమవారం రాత్రి నోటీసులను ఇచ్చారు. ధర్నాకు పోలీసుల అనుమతిలేదని నోటీసుల్లో స్పష్టం చేసిన పోలీసులు ఒకవేళ నోటీసు నిబంధలను ధిక్కరించి ధర్నాకు వెళితే సెక్షన్ 30 పోలీసు చట్టాన్ని ధిక్కరించినట్టుగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని యూటీఎఫ్ నాయకులు వెల్లడించారు. ఏలూరు, ముదినేపల్లి, ద్వారకాతిరుమల, నూజివీడు, కైకలూరు, చింతలపూడి, చాట్రాయి, నిడమర్రు, దెందులూరు తదితర మండలాల్లోని సంఘ నాయకులతో పాటు, జిల్లాస్థాయి నాయకులకు సోమవారం సాయంత్రం నుంచే నోటీసులు ఇస్తున్నారని, మరికొందరు అందుబాటులో లేకపోవడంతో వారి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారని వివరిం చారు. కొన్నిచోట్ల యూటీఎఫ్ నాయకులను హౌస్ అరెస్టులు చేశారని సంఘనాయకులు తెలిపారు. పోలీసులు ఎక్కడికక్కడ జల్లెడ పడుతుండడంతో యూటీఎఫ్ కేడర్ పలుచోట్ల అజ్ఞాతంలోకి వెళ్లిపోగా, మరికొందరు వివిధ మార్గాల్లో విజయవాడకు చేరుకునేందుకు ఎవరికి వారే ఏర్పాట్లు చేసుకున్నారు.


కాళ్ళ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్మా జీవో ప్రతులు దహనం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సమగ్ర శిక్ష షోకాజ్ నోటీసులకు స్పందించింది పది మందే !

తమ డిమాండ్ల సాధన కోసం గతనెల 21 నుంచి నిరవధిక సమ్మెబాట పట్టిన సమగ్రశిక్ష అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు విధుల్లోకి చేరాలంటూ మొత్తం 354 మందికి జిల్లా అధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసులకు స్పందించిన కొందరు సోమవారం చాలా స్వల్ప సంఖ్యలోనే విధులకు హాజరయ్యారు. ఇలా విధులకు హాజరైనవారిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్టీలు, మెసెంజర్లు కలిపి పదిమంది ఉన్నారని, మెజార్టీ సంఖ్యలో ఉద్యోగులు సమ్మెలోనే కొనసాగుతున్నారని ఎస్ఎస్ఏ అధికార వర్గాలు వెల్లడించాయి. గత శనివారం జారీ చేసిన షోకాజ్ నోటీసుల ప్రకారం వారంరోజుల గడువును ఉద్యోగులకు విధించిన విషయం విదితమే. మరికొందరు ఉద్యోగులు క్యాజువల్ లీవుపై ఉన్నారని అధికారులు వివరించారు.

108,104 ఉద్యోగుల సమ్మె సైరన్

23 వరకు నిరసనలు

స్పందించకుంటే సమ్మెకు..

తాడేపల్లిగూడెం రూరల్/ ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 8 : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 108, 104 ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. సోమవారం ఉద్యోగ సంఘ నేతలు అమరావతిలో మెడికల్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, ఆరోగ్యశాఖ సీఈవోలకు సమ్మె నోటీసు అందించారు. ఈనెల 23 వరకు వివిధ రీతుల్లో నిరసన తెలియజేస్తామని అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెకు వెళతామని నోటీసులో పేర్కొన్నారు. మంగళవారం ఉద్యోగ సంఘ జిల్లా కమిటీలు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో, ఆరోగ్య కో-ఆర్డినేటర్ తదితర ప్రతినిధులకు సమ్మె నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికుల సమ్మెకు తోడుగా 108, 104 అంబులెన్స్ వాహనాలపై పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారన్న సమాచారంతో జిల్లాలో ఈ అంబులెన్స్ సేవలను నిర్వహిస్తోన్న అరబిందో సొసైటీ ప్రతినిధులు అప్రమత్తమయ్యారు. ఒకవేళ తమవద్ద పనిచేస్తోన్న సిబ్బంది సమ్మెబాట పడితే వైద్యసేవలకు విఘాతం కలుగకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ చర్యలపై ఏర్పాట్లు చేస్తున్నట్టు అంబులెన్స్ సేవల జోనల్ మేనేజర్ గణేశ్ వెల్లడించారు.పశ్చిమ గోదావరి జిల్లాలో 108 వాహనాలు 21 ఉండగా అందులో 96 మంది వివిధ విభాగాల సిబ్బంది పనిచేస్తున్నారు. 104 వానాలు 21 ఉండగా 42 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 108 అంబులెన్స్ వాహనాలు 28 ఉండగా, ఒక్కో వాహనంలో పైలట్ (డ్రైవర్), ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) విధులు నిర్వర్తిస్తుంటారు. ఒక్కో వాహనం రోజుకి సగటున 5 కేసులు (కాల్స్)కు వైద్య సేవలందిస్తోంది. ఇక 104 అంబులెన్స్ వాహనాలు 45 ఉండగా, ఒక్కో వాహనంలో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇవి గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసి) క్యాంపుల్లో భాగంగా రోజుకి సగటున 300-800 మంది వరకు 74 రకాల మందుల పంపిణీ, తొమ్మిది రకాల రోగనిర్ధారణ పరీక్షలు చేస్తుంటాయి. వీరందరినీ అరబిందో సొసైటీ ద్వారా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకోగా వేతనాలను ప్రభుత్వం నేరుగా అరబిందో సొసైటీకి చెల్లిస్తోంది. ఇదిలా ఉండగా 104, 108 వాహనాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తమను రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆప్కాస్ (ఏపీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్) పరిధిలోకి తీసుకు రావాలని, ప్రభుత్వ వైద్యకళాశాలల్లో నియామకాలు చేపట్టిన మెడికల్ టెక్నీషియన్ పోస్టుల్లో ఇప్పటివరకు తాము అందించిన సర్వీసుకు వెయిటేజీ ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మెబాట పట్టాలని యోచిస్తున్నారు. సమ్మెపై ఇంతవరకు అరబిందో సొసైటీకి ఉద్యోగులెవరూ నోటీసులివ్వలేదని, తమ సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం (ఎస్మా) పరిధిలోకి తెచ్చినందున రోగులెవరికీ అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని సొసైటీ జోనల్ మేనేజర్ గణేశ్ వివరించారు.


అమరావతిలో సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

33 మంది సీఐల బదిలీ
7
నేడే రేపో ఎస్ఐలు


బాధితుల గోడు వింటున్న జేసీ రామ్‌సుందర్ రెడ్డి

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి : జేసీ

భీమవర, జనవరి 8 : స్పందనలో వచ్చే పిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 289 అర్జీలను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్క రించాలన్నారు. తనకున్న మూడు సెంట్లు స్థలంలో ఉన్న ఇంటిని మాయ మాటలు చెప్పి రాయించుకుని తన కొడుకు ఇంటి నుంచి బయటకు గెంటి వేశాడని పాలకోడేరు మండలం వేంద్ర గ్రామ వాసి వీరవల్లి సీతామహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. తనచిన్న కొడుకు ప్రభుత్వ ఉద్యోగం చేస్తు మరణించాడని ఎన్‌వోసీ ఇస్తే 10 లక్షలు ఇస్తానని నమ్మపలికి 50 లక్షలు రాగా సొమ్ముతో నా కోడలు పుట్టింటికి వెళ్ళి వేరే పెళ్ళి చేసుకుందని వృద్ధులైన మమ్ములను అన్యాయం చేసిందని పాలకొల్లు మండలం దగ్గులూరుకు చెందిన వాసా సత్యాలింగం వాపోయారు. 'ప్రభుత్వ వారు ఇంటి స్థలం మంజూరు చేశారు.. ఇల్లు కట్టుకుందామంటే కొందరు అడ్డు తగులుతున్నారు. నా భర్త చనిపోయారు. ఇద్దరు పిల్లలతో ఉంటున్నాను. తన ఇబ్బందులను తొల గించాలని" పెంటపాడు మండలం పరిమెళ్ళ గ్రామ నివాసి గండికోట కుమారి కోరారు. డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి ఆనందకుమార్, డీఆర్‌డీఏ పీడీ ప్రసాదయాదవ్, డీఎస్పీ బి.శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనలో 11 ఫిర్యాదులు



భీమవరం క్రైం, జనవరి 8 : భీమవరం డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రవిప్రకాశ్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) భీమారావు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.11 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. కట్న వేధింపులు, సరిహద్దు తగాదాలు, సివిల్ వివాదాలపై వినతులు అందినట్లు తెలిపారు. ఫిర్యాదులన్నింటిపై సత్వరమే విచారణ జరిపి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు.

నేటి నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 8 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు మంగళవారం నుంచి ఈనెల 18 వరకు, మిషనరీ పాఠశాలలకు ఈనెల 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులను ఇస్తున్నట్టు డీఈవో పి.శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. సెలవుల అనంతరం 19న పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు. సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించరాదని, ఈ మేరకు డీవైఈవోలు, ఎంఈవోలు, డీసీ ఈబీ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు

12 వేల ఆటోలు నిలిపివేత

- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు వద్దంటూ బంద్

భీమవరం క్రైం, జనవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ఆలోచనను మానుకోవాలని, ఆటో డ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేయవద్దంటూ జిల్లా అంతటా సోమవారం ఒక రోజు బంద్‌ను విజయవంతం చేశారు. జిల్లా మొత్తం మీద 12 వేల ఆటోలను నిలిపివేశారు. 90 శాతం ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నట్లు యూనియన్ జిల్లా నాయకులు ఇంటి సత్యనారాయణ తెలిపారు. భీమవరంలో 2,000, తణుకు 3,500, తాడేపల్లిగూడెం 3,000, నర్సాపురం 1,000, పాలకొల్లు 700, గణపవరం 800, ఆకివీడు 500, జువ్వలపాలెం, వీరవాసరం, నౌడూరు, మార్టేరు ప్రాంతాల నుంచి ఆటో డ్రైవర్లు బంద్‌లో పాల్గొన్నారని వివరించారు.

మా కడుపు కొట్టొద్దు : భీమవరంలో ఆటోల ర్యాలీ

ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామనడం తమ పొట్ట కొట్టడమేనని, ఏ పార్టీ అయినా, ఏ ప్రభుత్వ మైనా స్వార్థ రాజకీయాల కోసం ఇటువంటి పథకాలు ప్రవేశపెట్టి తమ కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఆటో యూనియన్ నేతలు, డ్రైవర్స్ వాపోయారు. 'మా కడుపు కొట్టొద్దంటూ' నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ పట్టణాల్లో ఆటో కార్మికులంతా సోమవారం ఉదయం నుంచి తమ ఆటోలను పక్కనపెట్టి ర్యాలీ చేశారు. భీమవరంలో 28 ఆటో యూనియన్లు ఏకతాటిపైకి వచ్చి తాము ఎదుర్కోబోయే సమస్యలపై నినదించారు. ప్రకాశం చౌక్ సెంటర్లో రెండు వేల మందికిపైగా ఆటో కార్మికులు కదం తొక్కుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఇంటి సత్యనారాయణ, పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు పంపన గోపి, ఆరేపల్లి బాలాజీ, గోపాల్‌కుమార్, సతీష్, జగన్‌మోహన్‌రావు, గుల్లిపల్లి శ్రీను, సురేష్‌స్వామి, వెంకటరమణ, ఏసు రత్నం, డానియల్, శ్రీను, ములుగుర్తి కృష్ణ, రవి, శివ, అన్నవరం, బాబీ, హరిబాబు, వాసు, చిన్న సత్యనారాయణ, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో 24 గంటల నిరసన దీక్ష



నినాదాలు చేస్తున్న ఆటో వర్కర్లు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 8: నిరుద్యోగులమైన తామంతా ఆటో వృత్తిలో జీవనోపాధి పొందుతున్నాం.. మహిళలకు ఆర్టీసీ బస్‌ల్లో ఉచిత ప్రయాణం అని మేనిఫెస్టోలో పెట్టడంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని యూనియన్ నేతలు వాపోయారు. తాడేపల్లిగూడెంలో సోమవారం ఉదయం ఆరు నుంచి 24 గంటల నిరసన దీక్ష చేపట్టారు. తమ కడుపు కొట్టొద్దని నినాదాలు చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు కండ్రెడ్డి వెంకటేశ్వరరావు, సెక్రటరి బి.ఎస్.వి. వరప్రసాద్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, విజయ్ తదితరులు నాయకత్వం వహించారు.

ఉచిత ప్రయాణ హామీని రద్దు చేయాలి : తణుకులో నిరసన

తణుకు, జనవరి 8: అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టో నుంచి ఆర్టీసీ ఉచిత ప్రయాణం హామీని రద్దు చేయాలని కోరుతూ సోమవారం నిరసన తెలిపారు. పట్టణంలో అన్ని ఆటో యూనియన్లు బంద్ నిర్వహించాయి. పలు ఆటో యూనియన్ సంఘాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే నిమ్మల



నిమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

పాలకొల్లు టౌన్, జనవరి 8: ఆటో డ్రైవర్లకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయంగా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్టీసీలో ఉచిత ప్రయాణంవల్ల నష్టం కలగ కుండా టీడీపీ, జనసేన కూటమి ఆలోచన చేస్తుందని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని చెప్పారు.

రేషన్‌షాపులు, వాహనాల పరిశీలన

పాలకొల్లు టౌన్, జన వరి 8: పట్టణం, మండలంలోని రేషన్‌షాపులను, ఎండీయూ రేషన్ వాహనాల ను స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇ.లక్ష్మీరెడ్డి, జె.కిరణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. సివిల్ సప్ల య్ గోడౌన్‌ను పరిశీలించి సరుకుల నిల్వలను, కాటాను పరిశీలించారు. అనంతరం లంకలకోడేరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. వంటకాలను రుచి చూశారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలన్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసిల్దార్ డి.సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఈడీ కొప్పర్తి

ఉండి, జనవరి 8 : ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించి వారి జీవనోపాధికి తోడ్పాటు అందించాలన్నదే తమ ధ్యేయమని ఎన్ఐఎంఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (చెన్నై) కొప్పర్తి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉండి మండలం ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు అధ్యక్షత వహించారు. కొప్పర్తి మాట్లాడుతూ, కళాశాలలో కార్పెంటరీ, టైలరింగ్ ప్రత్యేక శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తి చేసినవారికి రూ.15వేలు విలువైన ఉపకరణములు ఉచితంగా అందించడం, డిప్యూటి డైరెక్టరు చంద్రశేఖర్‌మౌళి, పి.శాంతన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 8: ఉద్యాన పంటలు లాభదాయకంచేయడానికి పలు రకాల కుటీర పరిశ్రమలు పరిచయడం చేయడం జరుగుతుందని ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణా సంచాలకులు ఈ.కరుణశ్రీ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీకే ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకం, పండ్లు, కూరగాయలు, పూలసాగులో విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. శిక్షణ ఐదు రోజులు కొనసాగుతుందన్నారు. శాస్త్రవేత్తలు జి. శాలిరాజు, కె.వెంకట సతీష్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ పెరేడ్‌కు సాయికిరణ్



భీమడోలు, జనవరి 8 : స్థానిక శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న దుద్దుపూడి సాయికిరణ్ ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎంపికైనట్లు ఎన్‌సీసీ అధికారి శివ శంకర్ తెలిపారు. 2017లో జరిగిన పెరేడ్‌లోనూ పాల్గొన్నాడు. కాకినాడ గ్రూపు 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ నుంచి రిపబ్లిక్‌డే పెరేడ్‌కు ఎంపిక కావడం గర్వకారణమని ప్రిన్సిపల్ రవి కుమార్ చెప్పారు.

షైనీకి జాతీయస్థాయి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న షైనీ

ఆకివీడు, జనవరి 8: ఎనిమిది నెలల నుంచే కరాటేలో మక్కువ చూపి ఇప్ప టికి వంద గోల్డ్ మెడల్స్ సాధించిన గంటా షైనీకి హైదరాబాద్ భాస్కరర ఆడిటోరియంలో హై రేంజ్ వరల్డ్ రికార్ట్స్ నిర్వాహకులు జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారం అందచేశారు. వివరాలను సోమవారం కోచ్ గంటా శ్రీను తెలియచేశారు. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ, షైనీ ఈ వయస్సులో అనేక టోర్నమెంట్‌లో పాల్గొనడం సామాన్యమైన విషయం కాదన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అచీవర్ జయంత్‌రెడ్డి, సరస్వతీ ఉపాసకులు శర్మ, రుద్రరాజు పద్మరాజు, మంజుషా, మిస్ గ్లోబల్ సంధ్య ఉన్నారు.

సేవలపై సన్నగిల్లిన ఆసక్తి!



- పుట్టిపెరిగిన ఊరిని పట్టించుకోని ఎన్ఆర్ఐలు
- తల్లిదండ్రులకు మమతానురాగాలు నిల్
- సాయమడిగితే సినిమా కష్టాలు..
- ఉమ్మడి పశ్చిమలో సుమారు 35 వేల మంది
- నేడు ప్రవాస్ భారతీయ దివస్

నిడమర్రు జనవరి 8 : ఒకప్పుడు విదేశాలకు వెళ్లిన ప్రతి ఎన్ఆర్ఐ దేశం కోసం పాటుపడే వారు. కన్నతల్లి కంటే పుట్టిన దేశం గొప్పదని భావించి సేవ చేయడానికి తహతహలాడేవారు. కానీ నేడు దేశం కోసం సేవచేసే ఎన్ఆర్ఐలను వేళ్లతో లెక్కపెట్టొచ్చు. తాను పుట్టిన పెరిగిన ఊరికి ఎంతో కొంత సేవ చేయాలనే భావన నాటి ఎన్ఆర్ఐలకు మెండుగా ఉంటే నేడు ఆ ఊసే తీయడం లేదు. తాము సంపాదించిన సొమ్ములో 10 నుంచి 30 శాతం వరకు పుట్టి పెరిగిన ఊరిలో ప్రజల కోసం వెచ్చించేవారు. జనవరి 9 ప్రవాస్ భారతీయ దివస్ సందర్భంగా వారి సేవలు గుర్తుచేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సేవల్లో వేగేశ్న ఫౌండేషన్‌దే పైచేయి

పశ్చిమ గోదావరిలో సేవల్లో ముందుండే ఎన్ఆర్ఐ కుటుంబంగా వేగేశ్న ఫౌండేషన్ వారిదే పైచేయి. వేగేశ్న అనంతకోటిరాజు విశాఖపట్నం కేంద్రంగా వేగేశ్న ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఇప్పటి వరకు సుమారు 100 కోట్లు పైచిలుకు వివిధ సేవా కార్యక్రమాలకు ఖర్చుచేశారు. ద్వారకాతిరుమలలో విర్డ్ హాస్పటల్ నిర్మించడంతో పాటు పెద్దతిరుపతిలో వెంగమాంబ అన్నసమారాధన భవనం నిర్మించారు. ఆడవికొలనుకు చెందిన పాపోలు వీరాస్వామి, అప్పారావు ఫౌండేషన్ పేరుతో ఎన్నో విద్య వైద్య సేవా కార్యక్రమాలతో పాటు యువత కు దుబాయ్‌లో ఉపాధి కల్పిస్తున్నారు. వసుధా ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవలు నిర్వహిస్తున్నారు.

వెకేషన్ కోసమే జన్మభూమి రాక!

విదేశాల్లో సెటిల్ అయిన కుటుంబాలు జన్మ భూమికి ఓ వెకేషన్‌కు వస్తున్నట్లు భావిస్తున్నారు. మూడేళ్లకో నాలుగేళ్లకో వచ్చి సెలవుల సరదా తీర్చుకొని వెళ్తున్నారు పండుక్కో పబ్బానికో వస్తూ వెళ్తున్నారు. సహాయం అడిగితే సినిమా కష్టాలు చెబుతున్నారే తప్ప వెన్నుదన్నుగా నిలబడడం లేదు. కరోనా తర్వాత భారతదేశం ముఖం చూడడం లేదు. లాక్‌డౌన్ పుణ్యమా అని స్వదేశం రాకపోవడం మానేశారు. పిల్లల చదువు పేరుతో వృత్తి వ్యాపారాలు ఒత్తిడి పేరుతో కొంత సమయం కూడా కేటాయించ లేకపోతున్నారు. కరోనా లాక్‌డౌన్ తర్వాత ఆర్థికంగా కొంత ఇబ్బందులు పడుతున్నట్లు ఎన్ఆర్ఐలు చెబుతున్నారు. సేవ కు లాక్‌డౌన్ పడ్డట్టైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనాభా 40,50,000 మంది కాగా, వారిలో ఎన్ఆర్ఐలు సుమారు 25 వేల నుంచి 35 వేల మంది ఉన్నారు.

జన్మభూమికి సేవ చేసే వారేరి..?

నాడు వందల సంఖ్యలో ఎన్ఆర్ఐలు ఉంటే వాళ్లల్లో పదుల సంఖ్యలో సేవకు సిద్ధమయ్యే వారు. కానీ నేడు లక్షల సంఖ్యలో ఉండగా సేవ చేసేవారు పదుల సంఖ్య కూడా దాటడం లేదు. ఇటీవల విదేశీ ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటున్నాయి. విదేశాలు వెళ్లిన వెనక్కి చూడడంలేదు. జన్మభూమికి సేవ చేయడంలో ముందుకు రావడం లేదు. గతం ప్రభుత్వాలు ఎన్ఆర్ఐలతో సమావేశమై ప్రోత్స హించేవారు. ఇటీవల వారిని కలసిన పాపాన పోలేదు. దీంతో వారికి జన్మభూమికి సేవ చేయాలనే ఆలోచన రావడం లేదు.

ప్రతి గ్రామంలో వీధికొకరు..

ఒకప్పుడు మండలానికి ఇద్దరో ముగ్గరో ఉంటుండే వారు. నేడు వీధికో ఎన్ఆర్ఐ ఉంటున్నాడు. అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, సౌత్‌ఆఫ్రికా, యూఏఈ, అరబ్ దేశాలలో సెటిలైన భారతీయులు కోకల్లలు. యూకె, యుఎస్‌ల్లో రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో భారతీయ ఎన్ఆర్ఐలదే కీలకపాత్ర పోషిస్తున్నారు. అమెరికా కేబినెట్ మినిస్టర్ కమలా హేరిస్, యూకే ప్రధాని రుషి సునాక్ లను ఉదాహరణగా చెప్పవచ్చు.

విదేశాలవైపు యువత చూపు

ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసిన యువత ఉపాధి కోసం విదేశాలవైపు చూస్తున్నారు. పెద్ద హోదా తోపాటు ఎక్కువ జీతభత్యాలు పొందవచ్చని పోటీపడుతున్నారు. అక్కడకు వెళ్లామా.. ఉన్నామా.. సెటిల్ అయ్యామా.. అని చూస్తున్నారే తప్ప కుటుంబం, మిత్రులు, తమ సొంతు ఊరు గురించి ఆలోచించడం లేదు. తమ ఎదుగుదలకు మూలమైన విద్యాసంస్థలను పట్టించుకోవడం లేదు. పనులు ఒత్తిడిలో శుభ, అశుభకార్యాలు జరిగిన హాజరు కావడానికి ఖాళీ లేదని చెబుతున్నారు. తల్లిదండ్రులకు అనారోగ్యం వస్తే మిత్రుడికి ఫోన్ చేసి వైద్యం చేయిస్తున్నారు. మమతానురాగాలు పంచడం లేదు.

33 మంది సీఐలకు స్థానచలనం

ఏలూరు క్రైం, జనవరి 8 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు, రాజమహేంద్రవరం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ గణేష్, బొమ్మూరు సీఐ ఆర్.విజయకుమార్, తాడేపల్లిగూడెం టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.ఎస్.వి. నాగరాజు, జీలుగుమిల్లి సీఐ బలుమూరి వెంకటేశ్వరరావు, ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ కె.శివాజీలను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. విజయవాడ కమిషనరేట్‌లో పనిచేస్తున్న టూటౌన్ సీఐ ఎ.సుబ్రమణ్యం, గుణదల సీఐ పి. కృష్ణమోహన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పి.రామచంద్రరావు, అబ్దుల్ సలామ్, బి.బి.మురళీకృష్ణ, వి.జానకిరామయ్య ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.వి. కృష్ణకుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సైబర్ క్రైంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ పి.సత్యానందం, ఎస్ఆర్‌పేట సీఐ బిహెచ్. వెంకటేశ్వర్లు, గవర్నర్‌పేట సీఐ నాగమురళీ, కృష్ణలంక సీఐ ఎం.వి. దుర్గారావు, నున్న సీఐ కె. శ్రీనివాసరావు, ట్రాఫిక్ వన్ సీఐ సుధాకర్, ట్రాఫిక్ టు సీఐ కె. క్రిష్టాఫర్, ట్రాఫిక్ త్రి సీఐ ఐడీ సువర్ణరాజు, సీసీఎస్ సీఐలు ఎం.రామ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ జి.వి. వినయ్ మోహన్, వీఆర్‌లో ఉన్న ఆర్. అంకబాబులను ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీచేశారు. వీరికి ఒకటి రెండు రోజుల్లో పోస్టింగులు కల్పించనున్నారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ వై.ఆర్.కె.శ్రీనివాస్‌ను కాకినాడలోని సర్పవరం సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎ. మురళీకృష్ణను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. కాకినాడలో దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.గోవిందరావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. విజయవాడ దిశ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె.వాసవిని తూర్పుగోదావరి జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కడియం సీఐ పి.బి.జె. తిలక్‌ను పశ్చిమగోదావరి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీచేశారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న సీఐ కె.అప్పలస్వామిని నర్సాపురం టౌన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీఐ జి. శ్రీనివాస్ యాదవ్‌ను కృష్ణా జిల్లా ఉయ్యూరు టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు ఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ అభ్యర్థులు 10, 11 తేదీల్లో రావాలి

ఏలూరు క్రైం, జనవరి 8: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ద్వారా తాత్కాలికంగా ఎంపికైన ఎస్‌సీటీ ఎస్ఐలు (సివిల్) (మేల్, ఫిమేల్), ఎస్‌సీటీ ఆర్ఎస్ఐల (ఏపీఎస్పీ) (మెన్)కు ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏలూరులోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయానికి ఈ నెల 10, 11 తేదీలలో హాజరు కావాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న 'పాహిరామ ప్రభో' గీతాలపాన

భీమవరం టౌన్, జనవరి 8 : త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఏఎస్ఆర్ నగర్‌లో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన పాహిరామ ప్రభో గీతాలపాన సంగీత ప్రియులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన పోపూరి గౌరీనాథ్ దర్శకత్వంలో మూడు గంటల పాటుసాగిన గాత్ర కచేరిలో భద్రాచల రామదాసు సంకీర్తన పాడి వినపించారు. ముందుగా ధన్యాసి రాగం, ఆదితాళంలో తారక మంత్రము కోరిన దొరకదు కీర్తనతో ప్రారంభించారు. సౌరాష్ట్ర రాగం ఆదితాళంలో తక్కువేమి మనకు, శంకరాభరణం రాగంలో శ్రీరామామము మరువము, పాహిరామ ప్రభో, కాపీ రాగంలో చరణములే నమ్మితిని, కంభోజీ రాగంలో యక్షవాకుల తిలక కీర్తన, తోపాటు పలుకే బంగారామాయే లాంటి కీర్తనలను ఆలపించి భక్తి రసాన్ని రుచిచూపించారు. పాలపర్తి నాగేశ్వరరావు వయోలిన్, ఇంద్రకీలాద్రి శర్మ వేణువు, మంగళగిరి శ్రీధర్ మృదంగం, చిట్టి బాబు తబలా సహకారం అందించారు. పోపూరి చారుమతిపల్లవి, భావశ్రీగీతిక, బి హరిత, ఎం శ్రీనిధి, ఎస్ఎస్ కీర్తన, గౌరీనాథ్ ఆలపించారు. వాఖ్యాతగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణ వ్యవహరించారు. గాదిరాజు సుబ్బరాజు, సుబ్రహ్మణ్యం, చెరుకువాడ సోదరులు పాల్గొన్నారు.



ప్రజ్ఞ కళాశాల జట్టుకు కప్పు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

డీఆర్‌జీలో బాల్‌బాట్మింటన్ ఎంపికలు

పెంటపాడు, జనవరి 8: డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల బాల్ బాట్మింటన్ జట్టు సెలక్షన్స్ నిర్వహించారు. తొలుత విశ్రాంత అధ్యాపకులు అప్పారావు పోటీలను ప్రారంభించారు. పోటీలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఆయా కళాశాల నుండి ఐదు టీంలు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మొదటి స్థానంలో భిక్కవోలు ప్రజ్ఞ కళాశాల విద్యార్థులు, రెండో స్థానంలో పెంటపాడు డీఆర్ గోయింకా, మూడో స్థానంలో రాజమండ్రి ఎస్‌కేవైటీ కళాశాలకు చెందిన జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. అనంతరం వీరిలో 10 మంది సభ్యులతో యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశారు. ఫిబ్రవరిలో బెంగుళూరులో జరిగే నార్త్ యూనివర్సిటీ (జాతీయ స్థాయి పోటీలలో) పాల్గొంటారు. పీడీ అజ్జిబాబు, స్పోర్ట్ ఇన్‌చార్జి జే.విజయ్‌బాబు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. యూనివర్సిటీ అబ్జర్వర్ దేవానంద్, కమిటీ సభ్యులు మోహన్‌రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో సినీ, బుల్లితెర నటుడు సాయినాథ్



ద్వారకాతిరుమల, జనవరి 8: చిత్ర పరి శ్రమలో శ్రమకు అదృష్టం తోడైతేనే విజ యం దక్కుతుందని సినీ, బుల్లితెర నటుడు సాయినాథ్ అన్నారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, తాను 18 సంవత్సరాల నుంచి బుల్లితెరలో దాదాపు 40 మెగా సీరియల్స్‌లో విభిన్న పాత్రలు చేశానన్నారు. రాధిక, మురళీమోహన్‌లతో సీరియల్స్‌లో నటించానన్నారు.



సీఐ సుభాశ్‌తో చర్చిస్తున్న వీరాంజనేయులు, పచ్చమట్ల

షాపుల తొలగింపులో ఉద్రిక్తత

- కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపునకు యత్నం
- అధికారులతో టీడీపీ, జనసేన నేతల సంప్రదింపులు
- వాయిదా కోరిన ఆక్రమణదారులు
- హామీ పత్రాలతో తాత్కాలికంగా సద్దుమణిగిన సమస్య

గణపవరం, జనవరి 8: పోరంబోకు స్థలాల్లో దీర్ఘకాలంగా ఉన్న షాపుల తొలగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మండలంలోని పిప్పరలో ఆర్అండ్‌బీ పోరంబోకు స్థలంలో సంవత్సరాల క్రితం ఏడు షాపులు నిర్మించారు. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు, రెవిన్యూ అధికారులు షాపుల తొలగింపును చేపట్టారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చమట్ల ధర్మరాజు, టీడీపీ నేత ఇందుకూరి రామకృష్ణంరాజు కార్యకర్తలతో కలిసి ఘటనస్థలానికి చేరుకున్నారు. సంక్రాంతి సందర్భంగా తాము తీవ్రంగా నష్టపోతామని,గడువు ఇప్పించాలని గన్ని, పచ్చమట్లకు షాపు యాజమానులు మొరపెట్టుకున్నారు. స్థానిక, జిల్లా ఉన్నతాధికారులను తొలగింపును వాయిదా వేయాలని గన్ని ఫోన్ ద్వారా కోరారు. ప్రత్యామ్నాయం దొరికే వరకు కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని రాతపూర్వకంగా షాపు యాజమానులు అధికారులకు హామీ పత్రాలు అందించారు.

మోగల్లు హైస్కూల్ హెచ్‌ఎంపై విచారణ



విచారిస్తున్న డీవైఈవో

పాలకోడేరు, జనవరి 8 : మోగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.వి. త్రినాథ్‌పై వచ్చిన ఆరోపణలపై సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో భీమవరం డీవైఈవో శ్రీరామ్ విచారణ చేపట్టారు. చిన్నచిన్న తప్పులకే వేధిస్తున్నారంటూ యూటీఎఫ్, ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు గోపిమూర్తి, కె.వి. రామచంద్రరావు, విజయరామరాజు, డీవీ పాండురంగారావులకు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

19న గొల్లలకోడేరులో ఇస్కాన్ మందిరం ప్రారంభం

భీమవరం టౌన్, జనవరి 8: పట్టణంలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈ నెల 19న గొల్లలకోడేరులో నూతనంగా నిర్మిస్తున్న ఇస్కాన్ మందిరంలో సంకీర్తన భవన విభాగాన్ని అంతర్జాతీయ సనాతన ధర్మ ప్రచారకులు భక్తి వికాస స్వామీజీ ప్రారంభిస్తారని కృష్ణచైతన్య సంఘం ఇస్కాన్ భీమవరం కేంద్ర పర్యవేక్షలు వంశీ కృష్ణ దాస్ తెలిపారు. స్థానిక ఏఎస్ఆర్ సేవాసమతి భవనంలో సోమవారం సమావేశం నిర్వహించి ఇస్కాన్ భవన ప్రారంభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గోపాలకృష్ణంరాజు, కృష్ణశ్రమ దాసు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులపై కేసు

ఏలూరు క్రైం, జనవరి 8 : వరకట్న వేధింపులపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివి. ఏలూరు తంగెళ్ళమూడికి చెందిన ముడిచర్ల పావనిగంగకు గత ఏడాది మే 11న రాజమహేంద్రవరానికి చెందిన దాసమూరి వెంకట దుర్గారావుతో వివాహం జరిగింది. సమయంలో రూ.12.50 లక్షల నగదు, 10 కాసుల బంగారు ఆభరణాలు, అదనపు సారె అందించారు. అదనంగా కట్నం తీసుకురావాలని భార్యను వేధించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు వెంకట దుర్గారావుపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

కుళాయి వద్ద మహిళల ఘర్షణ..

ఆకివీడు, జనవరి 8: దుంపగడపలో కుళాయిల దగ్గర నీళ్లు పట్టుకొనే సమయంలో ఇద్దరి మహిళలు ఘర్షణ పడ్డారు. నీళ్ళ సత్యవతి అనే మహిళ చిన్ని తులసీ రామలక్ష్మిని మెడలో టవలు వేసి గుంజడంతో రోడ్‌పై పడిపోయింది. దీంతో ఆమె మోకాలుకు దెబ్బలు తగిలాయి. చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్లపై ..

ఆకివీడు, జనవరి 8: ముగ్గురు పేకాటరాయుళ్లపై సోమవారం కేసు నమోదు చేశారు. చెరుకుమిల్లిలో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,800 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

గ్యాస్ లీకై వ్యక్తికి గాయాలు

ఆకివీడు, జనవరి 8: వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలివి. కమతవానిగూడెంకు చెందిన చుక్కా సుందరం సోమవారం ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో అతడు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి వైరు చోరీ

ఏలూరు క్రైం, జనవరి 8 : ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి దుండగులు రాగి వైరును చోరీ చేశారు. వివరాలివి. దుగ్గిరాల పంచాయతీ పరిధిలో చింతమనేని శ్రీరంగ సతీష్‌కుమార్ పొలంలో 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈనెల 5న గుర్తు తెలియని దొంగలుట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి 30 కేజీల రాగి వైరును అపహరించుకుపోయారు. దీంతో విజయరాయి ఏఈ పి.శ్రీనివాస్ ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన రాగి వైరు విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

207 మంది బైండోవర్

ఆకివీడు, జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలో 207మందిని బైండోవర్ చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు సోమవారం తెలిపారు. పేకాట, కోడిపందేలు నిర్వహించే వాళ్లపై-165, కోడి కత్తులు కట్టేవాళ్ల ఏడుగురు, నిర్వాహకులు ఏడుగురు, స్థలదారులు ముగ్గురు, పాత ఎలక్షన్ కేసులో 25 మందిని బైండోవర్ చేశామని వివరించారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

- ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస కూలీలుగా వచ్చి నేరాలకు పాల్పడుతున్నవైనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు క్రైం, జనవరి 8 : ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస కూలీలుగా వచ్చి నేరాలకు పాల్పడుతున్న ఒక ముఠాలోని ఇద్దరు సభ్యులను ఏలూరు వన్ టౌన్ సీఐ ఎన్. రాజశేఖర్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారని డీఎస్పీ ఈ. శ్రీనివాసులు చెప్పారు. వన్ టౌన్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 25వ తేదీ రాత్రి ఏలూరు వన్ టౌన్‌లో ఓ ఎలక్ట్రికల్ వ్యాపారి మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఇద్దరు వ్యక్తులు అతడి తలపై కొట్టి మోటారు సైకిల్, నగదు బ్యాగ్ అపహరించుకుపోయారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశారు. బృందం ఇన్‌ఛార్జి ఎన్. రాజశేఖర్, నిడమర్రు సీఐ శుభాష్, వన్‌టౌన్ ఎస్ఐ ఎస్.లక్ష్మణబాబు, చేబ్రోలు హెడ్‌కాని స్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ నాగరాజు, వన్‌టౌన్ కానిస్టేబుల్స్ నాగార్జున, ఎం. ఆర్.వి. దుర్గారావు, సిహెచ్. లక్ష్మీనారాయణ, ఎండి రుహుళ్ల బృందం సభ్యులుగా ఉన్నారు. నగరంలో నిఘా ఏర్పాటు చేశారు. వన్‌టౌన్‌లోని డాక్టర్ మల్లయ్య ఆసుపత్రి రోడ్డులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గుర్తిం చారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఢిల్లీలోని ఆగ్రాకు చెందిన వారు ప్రస్తుతం ఉత్తర్ ప్రదేశ్‌లోని మధురలో ఉన్నట్లు గుర్తించారు. సావిర్ అలియాస్ బిజేందర్ ఖాన్ (45), పూరంసింగ్ (54), ఉత్తర్‌ప్రదేశ్‌లోని పూరీ గ్రామానికి చెందిన రవి (35) ఒక ముఠాగా ఏర్పడి నేరాలు చేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. వీరిలో రవి పరారీలో ఉండగా మిగిలిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఏలూరుకు ఆయా ప్రాంతాల నుంచి వలస కూలీలుగా వచ్చిన వారి ద్వారా ఇక్కడ ఇళ్లను అద్దెకు తీసుకుని నేరాలకు పాల్పడుతున్నారు. వాల్కేర్ వర్క్ చేస్తామని చెప్పుకుంటున్నారు. ఏలూరు వన్‌టౌన్‌లో ఒకటి, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దారిదోపిడీ, వన్‌టౌన్ చెయిన్ స్నాచింగ్, ఏలూరు టూటౌన్ పరిధిలో మోటారు సైకిల్ అపహరణ మొత్తం ఏడు నేరాలకు పాల్పడినట్లు వారు అంగీకరించారు. వారిని అరెస్టు చేసి రెండు మోటారు సైకిళ్లు, రూ.10 వేల నగదు, 33 గ్రాముల బంగారు నక్లీసు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న రవి కోసం మరో బృందం గాలిస్తుందని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఎన్. రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

హత్యకేసు నిందితుడికి జీవితఖైదు

పెదవేగి, జనవరి 8: మహిళను పాశవికంగా హత్యచేసిన నిందితుడికి జీవితఖైదు శిక్ష విధిస్తూ ఏలూరు జిల్లా అదనపు జడ్జి రామ్‌గోపాల్ తీర్పు ఇచ్చారు. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. 2020 జూలై 7న మండలంలోని ముండూరు సమీపంలో పోలవరం కుడికాలువ గట్టుపై తుప్పల్లో సుమారు 30 ఏళ్ళ మహిళ మృతదేహం మెడకు చున్నీతో బిగించి ఉంది. ముండూరు వీఆర్వో శివకనక వెంకట అప్పారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ వెంకట నాగరాజు కేసు నమోదు చేశారు. అప్పటి ఏలూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు దర్యాప్తు చేసి దెందులూరు మండలం గాలాయగూడెం శివారు నాగులదేవునిపాడుకు చెందిన గుజ్జల సందీప్‌ను నిందితుడిగా గుర్తించి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహిళ మృతికి సందీప్ కారకుడిగా నిర్ధారణ కావడంతో జడ్జి రామ్‌గోపాల్ పైవిధంగా తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పీపీ కె.లక్ష్మణ్‌నాయక్ వాదనలు వినిపించారు. పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్, ఎస్ఐ ఎం.లక్ష్మణ్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.వాసు సహకరించారు.

పాస్‌పోర్టు లేక ఇరుక్కుపోయిన నైజీరియన్

భీమవరం క్రైం, జనవరి 8 : డ్రగ్స్ సరఫరా కేసులో జైలులో శిక్ష అనుభవించిన నైజీరియన్ దేశస్తుడికి పాస్‌పోర్టు లేకపోవడంతో సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు) అష్టకష్టాలు పడుతున్నారు. సెబ్ స్టేషన్ సీఐ వి.వర్మ వివరాలు ఇలా ఉన్నాయి. 2022 జనవరి 27న డ్రగ్స్ సరఫరా చేస్తున్న కేసులో బెంగుళూరు నుంచి నైజీరియన్ దేశస్తుడ్ని భీమవరం తీసుకువచ్చారు. న్యాయస్థానంలో అతడిని హాజరు పరచగా శిక్ష విధించారు. దీంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో ఉంచారు. ఇటీవలే శిక్ష పూర్తి అయింది. అతడిని నైజీరియాకు పంపిద్దామంటే పాస్‌పోర్టు లేదు. సరైన పత్రాలు కూడా లేవు. నైజీరియా ఎంబసీకి సమాచారం ఇచ్చి హైద్రాబాద్‌లోని ఫారిన్ రీజనల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఎఫ్ఆర్ఓ) ద్వారా తాత్కాలిక పాస్‌పోర్టులో నైజీరియాకు పంపించి అతడి బంధువులకు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు.

పాస్‌పోర్టు ఏమైంది?

2022లో పట్టుబడిన నైజీరియన్ వద్ద పాస్‌పోర్టు ఎందుకు లేదో అర్థం కావడం లేదు. ఇతర దేశస్తులు ఏదైనా కేసులో పట్టుబడితే అతడి పాస్‌పోర్టు, వీసా అధికారులు ముందుగా స్వాధీన పరుచుకుంటారు. అతడి వద్ద ఎలాంటి పత్రాలు లేవని అధికారులు చెప్పడం గమనార్హం.

నేటినుంచి సంక్రాంతి యువజనోత్సవాలు ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్‌ఐ నేతలు

ఆకివీడు, జనవరి 8 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజ నోత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ, ఆహ్వాన సంఘం కోశాధికారి బి.రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మంగళవారం నుంచి క్రీడలు ప్రారంభమవుతాయని, నలభై ఏళ్ల నుంచి దాతల సహకారంతో పోటీలు నిర్వహి స్తున్నామన్నారు. సందక సూరిబాబు, జి.ధనుష్, రవితేజ ఉన్నారు.

ఇంటింటికి 'జనంలోకి జనసేన'

భీమవరం, జనవరి 8 : జనంలోకి జనసేన కార్యక్రమం పేరుతో భీమవరం అసెంబ్లీ పరిధిలో జనసేన, టీడీపీ ఉమ్మడి ఎన్నికల ప్రణాళికను ప్రజల ఇంటికి వెళ్లి అందించే కార్యక్రమం ప్రారంభించామని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని 18,19వ వార్డులలో జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి మేనిఫెస్టో వివరించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవీంద్రనాథ్ ఠాగూర్, మాజీ కౌన్సిలర్ మాగాపు ప్రసాద్, టీడీపీ మాజీ కౌన్సిలర్ నౌషాద్, యర్రంశెట్టి రాజేష్, భీమవరం మండల సెక్రెటరీ నీరేంద్ర, మాదాసు బాబి తదితరులు పాల్గొన్నారు.

'తాపీ చెక్కిన శిల్పం' పుస్తకం ఆవిష్కరణ



తాపీ చెక్కిన శిల్పం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం/రాజమహేంద్రవరం, జనవరి 8: రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా సోమవారం వీరవాసరం మండలం నవుదూరు జంక్షన్‌కు చెందిన వడ్డీ సుబ్బారావు రచించిన తాపీ చెక్కిన శిల్పం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రాంగణంలోని నన్నయ కళావేదికపై జరిగిన కార్యక్రమంలో తెలుగు మహాసభల కార్యదర్శి రెడ్డప్ప ధవేజీ, ముఖ్య సమన్వయకర్త కేశిరాజు రాంప్రసాద్, కడిమెళ్ల వరప్రసాద్, ఉపాధ్యక్షుడు, ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, పాటల రచయిత రసరాజు తాపీ చెక్కిన శిల్పం పుస్తక రెండో ముద్రణను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత వడ్డీ సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

'నిడమర్రు సర్కిల్ పరిధిలో 226 బైండోవర్ కేసులు'

గణపవరం, జనవరి 8: సంక్రాంతి ముసుగులో కోడిపందేలు, పేకాట, జూదాలు చట్టరీత్యా నేరమని నిడమర్రు సీఐ ఎం.వి.సుభాష్, తహసీల్దార్ పమ్మి లక్ష్మి హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల నివారణ చర్యలపై రెవెన్యూ, పోలీసు, పలు శాఖల సిబ్బందితో సోమవారం పిప్పర పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టేం దుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామన్నారు. సీఐ మాట్లాడుతూ నిడమర్రు సర్కిల్ పరిధిలో 226 మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. గణపవరం స్టేషన్ పరిదిలో 112, నిడమర్రు పరిధిలో 45, చేబ్రోలు పరిధిలో 69 బైండోవర్ కేసులు నమోదు చేశామని వివరించారు.

వాసవీ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు 'అత్యం' మృతి



సూర్యప్రకాశరావు (ఫైల్)

పాలకోడేరు, జనవరి 8 : శృంగవృక్షం శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్యం సూర్యప్రకాశరావు(78) మృతిచెందారు. నెల రోజులుగా అనారోగ్యంతో మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆయన మృతికి ఆర్యవైశ్య సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సంఘ కార్యవర్గ సభ్యులు కూర్మాల నారాయణరావు, గ్రంధి రాజా, పచ్చిపులుసు యానాది శెట్టి, సోమురామకృష్ణ, పూర్ణారావు, బ్రహ్మాజీ, నరసింహరావు, తదితరులు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు యామల రాంబాబులు సంతాపం తెలిపారు.

'ఓటును పవిత్రంగా నీతి నిజాయతీగా వేయాలి'

భీమవరంటౌన్, జనవరి 8 : ఓటును పవిత్రంగా నీతి నిజాయతీగా వేయాలని, ఓటును వేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి సమర్థవంతమైన నాయకత్వానికి ఓటు వేయాలని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.జేమ్స్ అన్నారు. జిల్లా రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి స్వచ్ఛమైన ఓటు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ప్రకాశంచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.చంద్రరావు, పిఎస్ఎస్ ప్రసాద్, ఎండి అలి, ఎం.పుల్లరాజు, కె.రంగరాజు, కొల్లూరి రాజు, చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో ముగ్గుల పోటీలు



బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు టౌన్, జనవరి 8 : పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం పాల కొల్లు పట్టణ స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు సోమవారం నిర్వహించారు. శ్రీనివాసా డీలక్స్ రోడ్డులో జరిగిన పోటీల్లో మొత్తం 68 మంది పాల్గొన్నారు. వీరిలో పది మంది విజేతలుగా నిలిచారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ఫౌండేషన్ తరపున చీర, ప్లాస్టిక్ డబ్బాలు ఎమ్మెల్యే నిమ్మల అందజేశారు. టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమని పోటీలకు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. లక్ష్మింశెట్టి సునీత, తోట వరిజలిల్లీ, జి.లక్ష్మీకుమారి తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ ఈనెల 14న ముగింపు కార్య క్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పార్ల పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, నాయకులు కర్నేన గౌరునాయుడు, పి.తులసీరావు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతులు అందజేత

పెనుమంట్ర, జనవరి 8 : మండలస్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలు-2024లో పెనుమంట్రలోని విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని స్కూల్ కరస్పాండెంట్ టి.సంజీవ్ రెడ్డితెలిపారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచారన్నారు. విజేతలను పాఠశాల నిర్వాహకురాలు టి.హెలెన్, ఉపాధ్యాయులు అభినందించారు.

11 మంది జూదరుల అరెస్టు

పెనుమంట్ర, జనవరి 8 : మల్లిపూడి గ్రామ శివారులో పేకాటాడుతున్న 11 మందిని అరెస్ట్ చేశారని డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. డీఎస్పీకి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 11మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్దనుంచి రూ.20,650 నగదు, 9 మోటారు సైకిళ్ళు, 9స్మార్ట్ ఫోన్‌లు, ఒక కీప్యాడ్‌ఫోన్, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు కోడి పందేలు, పేకాటలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భీమవరంలో అంగన్‌వాడీల దీక్షలో మాజీ మంత్రి పీతల, నరసాపురంలో సీఐటీయూ నాయకుల ఆందోళన, తణుకులో ఎస్మా జీవోల దహనంలో ఆరిమిల్లి

ఎస్మా ప్రయోగం సిగ్గుచేటు

- 28వ రోజు అంగన్‌వాడీల ఆందోళన
- ఎస్మా జీవో కాపీల దహనం
- అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు

నరసాపురం టౌన్/మొగల్తూరు, జనవరి 8: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా వారిపై ఎస్మా ప్రయోగించడం సిగ్గుచేటని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో అంగన్‌వాడీల దీక్షకు సంఘీభావం తెలిపి ఎస్మా పత్రాలను దహనం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఎం.త్రిమూర్తులు, పి.రాము, పి. నారాయణరావు, కొండ, సత్తిబాబు, అప్పలనాయుడు, ఇజ్రాయిల్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు ముత్యాలమ్మ గుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆందోళన శిబిరంలో అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఈ పోరాటానికి ప్రభుత్వం దిగి రాకుంటే అంగన్‌వాడీ సత్తా చాటుతామని హెచ్చరించారు.

- ఆకివీడు/కాళ్ల/పాలకోడేరు : హామీలు అమలు చేయడంపై జగన్ సలహాదారులు దృష్టి సారించకుండా అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు విమర్శించారు. ఆకివీడులో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందచేసి మాట్లాడారు. పెంకి అప్పారావు, అంగన్వాడీలు కృష్ణవేణి, సోము, దుర్గ, భాను, భవాని, వెంకటలక్ష్మి, కుమారి తదితరులు ఉన్నారు. కాళ్ల మండలంలో అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు. పాలకోడేరు మండలం పాలకోడేరులో అంగన్‌వాడీల దీక్ష సోమవారం కొనసాగింది. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన ప్రదర్శనలు చేశారు.
- పెనుమంట్ర : పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యదర్శి కోడి శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్మా జీవోలను రద్దు చేయాలని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ సెక్టార్ నాయకులు సరస్వతి. సాయి మహాలక్ష్మి, మౌనిక, సావిత్రి సూర్యప్రభ సూర్యకుమారి, సరిత, కల్యాణి భవాని, మల్లెపూడి రమణ తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె.సుబ్బరాజు ఉపాధ్యాయులు కడలి శ్రీనివాసు సంఘీభావం తెలిపారు.
- ఇరగవరం : ఎస్మా పేరుతో అంగన్వాడీలను వేధించడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అజయ్‌కుమారి అన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు ఆమె మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.

అంగన్వాడీల సమ్మెకు ఆరిమిల్లి మద్దతు

- తణుకు/అత్తిలి : తణుకు, అత్తిలి మండలంలో అంగన్‌వాడీల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు. సోమవారం 28వ రోజు సమ్మెలో అంగన్‌వాడీలతో కలసి ఆయన ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, కలగర వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు మాజీ మంత్రి పీతల మద్దతు

- భీమవరం టౌన్/వీరవాసరం : వైసీపీ ప్రభుత్వ దుర్మార్గవైఖరికి నిదర్శనం 28 రోజుల అంగన్వాడీల సమ్మె అని టీడీపీ నాయకురాలు, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. భీమవరంలో అంగన్వాడీల సమ్మెను సోమవారం ఆమెతో పాటు మెంటే పార్థసారథి సందర్శించి మద్దతు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు సీహెచ్ చంద్రశేఖర్, సీపీఎం సీపీఐ జిల్లా కార్యదర్శులు బి.బలరాం, కోనాల భీమారావు, సీఐటీయూ నేత గోపాలన్ మాట్లాడారు. వీరవాసరంలో అంగన్‌వాడీల సమ్మెకు మాజీ మంత్రి పీతల సుజాత మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాల పెంపు టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. ఎంపీపీ దుర్గాభవాని, మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి సురేష్, కడలి వాసు, తదితరులు పాల్గొన్నారు.
- వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శిబిరం వద్ద నుంచి పెదదళితపేటలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఐ.నిర్మల, వై.వెంకటలక్ష్మి, శాంతకుమారి, ఎం.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

14వ రోజు మునిసిపల్ కార్మికుల ధర్నా



భీమవరంలో మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా

భీమవరం టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతూ 14వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు రోడ్డెక్కారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని ధర్నా చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కిల్లారి మల్లేశ్వరరావు, చెల్లబోయిన రంగారావు, సీఐటీయూ నేత వాసుదేవరావు, నాని మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- తాడేపల్లిగూడెం రూరల్ : సమస్యల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం ఓవర్ బ్రిడ్జ్ సెంటర్‌లో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, తాడికొండ కనకమహాలక్ష్మి, తాడికొండ శ్రీనివాసరావు, ఓసూరి వీర్రాజు తదితరులు నాయకత్వం వహించారు.
- తణుకు మునిసిపల్ కార్మికుల దీక్ష శిబిరానికి మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెళ్లి మద్దతు ప్రకటించారు. గుమ్మళ్ళ హనుమంతరావు, ఎలుబూడి ఈశ్వరరావు, తమరాపు పల్లపరావు, బట్టవల్లి నాగరాజు, సిర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలి రా.. సభ విజయవంతం : తోట

భీమవరం అర్బన్, జనవరి 8: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఆచంటలో రా.. 'కదలి రా' బహిరంగ సభ విజయవంతమైందని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి సోమవారం పేర్కొన్నారు. సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజావేదిక కూల్చివేత నుంచి ప్రారంభమైన విధ్వంస, అవినీతి, అరాచక పాలన దేశంలో ఏ రాష్ట్రంలో లేదని విమర్శించారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చూపాలి : ఎమ్మెల్యే రామరాజు



చిలుకూరులో పార్టీలో చేరిన పలువురిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రామరాజు

ఉండి, జనవరి 8 : వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ సత్తా చూపించి విజయం అందించాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. సోమవారం చిలుకూరులో ఇంటింటికి తెలుగుదేశం ఎమ్మెల్యే మన రాంబాబు, బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ రుద్రరాజు బంగార్రాజు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించి అభినందించారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, పొత్తూరి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం మరుగున పడింది: ఆరిమిల్లి

తణుకు, జనవరి 8: వైసీపీ పాలనలో వ్యవసాయం పూర్తిగా మరుగున పడిందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ శాఖను మూసివేశారని, హార్టికల్చర్ రైతు రోడ్డున పడ్డాడని అన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని రెండో స్థానంలో, అప్పుల్లో దేశంలో మొదటి స్థానంలోకి జగన్ తెచ్చాడన్నారు. వైసీపీ 95 శాతం ప్రజా మద్దతు కోల్పోయిందన్నారు.

పన్నుల బాదుడుతో ప్రజలపై భారం : పొత్తూరి

నరసాపురం, జనవరి 8: అత్యధికంగా ప్రజలపై పన్నుల భారం మోపిన ఘనత దేశంలో జగన్‌కే దక్కుతుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పన్నుల పేరుతో ప్రజల రక్తాన్ని పీలుస్తూ మిమ్మల్ని బాగుచేస్తున్నానని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, షేక్ హుస్సేన్, పద్మ, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన వైసీపీ : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్ : వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆచంటలో చంద్రబాబు సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమి విజయం ఖాయమన్నారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు హామీని విరమించుకోవాలి'



పెంటపాడులో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

నరసాపురంటౌన్/ఆకివీడు/మొగల్తూరు/గణపవరం/తణుకు/ఉండి/పెంటపాడు, జనవరి 8 : ఏపీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని టీడీపీ, వైసీపీల ఎన్నికల హామీని తొలగించాలని నరసాపురం పట్టణంలో ఆటో యూనియన్ల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నరసాపురంలో భారీ ప్రదర్శన చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి ధర్నా నిర్వహించారు. అడ్డాల రమేష్, బుజ్జి, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఆకివీడు మెయిన్ సెంటర్‌లో ఆటో యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించి ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం అందజేశారు. మొగల్తూరు మండలంలో ఆటో డ్రైవర్లు స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి పాతకాలువ వరకూ ర్యాలీ నిర్వహించారు. తమ పొట్ట కొట్టవద్దంటూ నినాదాలు చేశారు. ఆటో డ్రైవర్లు చుండూరి రమేష్, కడలి సత్యనారాయణ, కవురు సత్యనారాయణ, కొత్తపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. గణపవర మండలంలో ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చమట్ల ధర్మరాజుకు వినతిపత్రాలు అందజేశారు. ఉచిత బస్సు హామీ అమలుపై తగున్యాయం చేయాలని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. తణుకు పట్టణంలోని అన్ని ఆటో యూనియన్లు బంద్ నిర్వహించాయి. ఉండి సెంటర్‌లో ఆటోవాలాలు ధర్నా నిర్వహించారు. పెంటపాడు మండలం పెంటపాడు గేటు సెంటర్ వద్ద ఆటో కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు.



గంగిరెద్దుల విన్యాసాలు తిలకిస్తున్న వావిలాల సరళాదేవి తదితరులు, పాలమూరు జడ్పీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

సంప్రదాయాలు నేర్పేందుకే సంబరాలు

తణుకు, జనవరి 8: మన సంస్కృతి, సంప్రదాయాలను నేటి యువతకు నేర్పించే లక్ష్యంతో లయన్స్ ద్వారా ప్రతి యేటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ క్యాబినెట్ సెక్రెటరీ వావిలాల సరళాదేవి, వావిలాల వెంకట రమేష్ అన్నారు. సోమవారం సజ్జాపురంలోని రామకృష్ణ సేవా సమితిలో లయన్స్ క్లబ్ స్వర్ణ ఆధ్వర్యంలో గంగిరెద్దుల విన్యాసం, హరిదాసు కీర్తనలు, బొమ్మలు కొలువు, ముగ్గులు, వంటల పోటీలు, విచిత్ర వేషధారణలు, సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ వంక రవీంద్రనాథ్, జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ అధ్యక్షురాలు చిట్టూరి సుజాత, కార్యదర్శి సుంకవల్లి చిరంజీవి కుమారి, వై.నాగరాజకుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను యువతలో పెంపొందించాలి

గణపవరం :ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు యువతలో పెంపొందించేందుకు కృషి చేయాలని సరిపల్లెకు చెందిన ప్రవాసాంధ్రుడు విష్ణుభట్ల లక్ష్మణ్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పురప్రముఖులతో కలిసి పాల్గొన్నారు. అమెరికా నుంచి సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చినట్టు విష్ణుభట్ల చెప్పారు.

- నరసాపురం రూరల్ : నరసాపురం మండలం వైఎస్‌పాలెంలోని హైస్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థినులు ముత్యాల ముగ్గులు వేశారు. సర్పంచ్ వైస్ నాగముత్యమాంబ, వైఎస్ బాబులు భోగి మంటలు వెలిగించి సంక్రాంతికి స్వాగతం పలికారు. ఛైర్మన్ పులపర్తి వెంకటనాగేశ్వరరావు, హెచ్‌ఎం కోలపర్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెనుమంట్ర :పొలమూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేశారు. భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు హెచ్‌ఎం బీడీ సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- వీరవాసరం : సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు, భావితరాలకు తెలిపేందుకే సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం ఎంవీడీ భవాని అన్నారు. మత్స్యపురి ప్రాథమిక పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రాయకుదురు జడ్పీహైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ బోను దుర్గాప్రసాద్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ గెద్దం భారతి భాస్కర్రావు, హెచ్‌ఎం కానుకొలను శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.
- కాళ్ళ : సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో మంచి లక్షణాలు పెంపొందించవచ్చని మండల విద్యాశాఖ అధికారి-2 జి.కనకరాజు అన్నారు. వేంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంక్రాంతి సంబరాలకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ యర్రింకి పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ ఆచంట నుంచే పోటీ చేస్తా

- రెండింతలు మెజార్టీ సాధిస్తా : ఎమ్మెల్యే రంగనాథరాజు

ఆచంట, జనవరి 8 : వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆచంటనుంచే పోటీ చేసి గత ఎన్నికల కంటే రెండింతలు మెజార్టీ సాధిస్తానని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంటలో జరిగిన రా.. కదలి రా.. సభలో చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి పితాని తనపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ సోమవారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబునాయుడు వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పితాని సత్యనారాయణ 15 ఏళ్ల పాటు మంత్రిగా పనిచేసినప్పటికీ తనస్థాయికి తగ్గట్టు మాట్లాడడం లేదన్నారు. ఆచంటలో జరిగిన సభకు జనసేన పార్టీ ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాష్‌ను పిలవకపోవడం పితానికి కాపుపై ఉన్న అహంకారానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆచంట నుంచి మరోసారి పోటీ చేద్దాం.. ఎవరు గెలుస్తారో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. తాను ఆచంట ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో చేపల చెరువులు తవ్వలేదని, ఇళ్ల పట్టాల్లోనూ అవినీతి జరిగిందని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'భూఆక్రమణలకు పాల్పడితే బహిర్గతం చేయాలి'

భీమవరం రూరల్, జనవరి 8 : 'చంద్రబాబు నాయుడు రూ.30 కోట్లు ఇస్తే చాలు నా ఇంటిని రాసిస్తా' అని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సవాల్ విసిరారు. భీమవరం పట్టణంలో రూ.80 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆచంటలో టీడీపీ సభలో చంద్రబాబు తనపై చేసిన భూ ఆక్రమణల ఆరోపణను నిరూపించాలని సవాల్ చేశారు. తనకు సొంతిల్లు లేదని, తమ్ముడి ఇంట్లో ఉంటున్నానని, సొంతంగా స్థలం కొనుగోలు చేసుకోవడానికి డబ్బులు లేక తాతలు ఇచ్చిన స్థలంలోనే బ్యాంక్ లోన్ తీసుకుని ఇంటిని నిర్మించుకుంటున్నానన్నారు.

రైతులకు అండగా వైసీపీ

ఇరగవరం, జనవరి 8 : రైతులను ఆదుకోవడంలో వైసీపీ ముందుందని మంత్రి కారుమూరి అన్నారు. సోమవారం రేలంగిలో ప్రజా దీవెన పాదయాత్రలో భాగంగా విలేకరులతో మాట్లాడారు. మిచౌంగ్ తుఫాను సమయంలో తడిచిన మొక్క ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేశామన్నారు. జడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆకివీడు, జనవరి 8: పండుగ సమయాల్లో కుటుంబాలు రోడ్డున పడకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్ఐ బత్తిన నాగబాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మహిళా పోలీసులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కోడి పందేలు, పేకాట, జూదం వంటి వాటికి అనుమతులు లేనందున నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీటీ ఫరూఖ్, ఆర్ఐ సాయితేజ తదితరులు ఉన్నారు.

'మొక్కలే మానవ మనుగడకు ఆధారం'

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 8 : మొక్కలే మానవ మనుగడకు ఆధారం అని పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రకృతిని కాపాడే దిశగా ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని ఉన్నత్ భారత్ అభియాన్ రీజనల్ కో-ఆర్డినేటర్ బి.పావని అన్నారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన గొల్లవానితిప్ప సచివాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లవానితిప్ప సర్పంచ్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ బి.రామకృష్ణ, గ్రామ కార్యదర్శి భవాని, డీఎన్నార్ కళాశాల ఉన్నత్ భారత్ అభియాన్ సమన్వయకర్త వి.ప్రవీణ్ పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీ విడుదల చేయాలి'

ఆచంట, జనవరి 8 : మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఈనెల 10న సీఈఏఎం ఆఫీసు ముట్టడి చేస్తున్నట్టు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎన్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద చలో సీఎం క్యాంపు కార్యాలయ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో కె.జయరాజు, తమరాపు దుర్గాప్రసాద్, మోహన్, తోట నవీన్, శంకర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు


మొగల్తూరు, జనవరి 8 : కేపీపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్‌లను సోమవారం విద్యార్థులకు బహూకరించారు. నరసాపురానికి చెందిన జీవాజీ గోల్డ్ ఆర్థిక సహకారంతో యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ముద్రించబడిన 75 మోడల్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. విద్యా కమిటీ ఛైర్మన్ ఉల్లంపర్తి బుల్లినర్సు, హెచ్‌ఎం జేవీ నరసింహమూర్తి, లయన్స్‌క్లబ్ సభ్యుడు చింతపల్లి కృష్ణమోహన్, ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు

వీరవాసరం, జనవరి 8 : సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, పేకాట, గుండాట నిర్వహించటం పాల్గొనటం చట్టరీత్యా నేరమని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు అని వీరవాసరం ఎస్ఐ పి.రమేశ్ కోరారు. సోమవారం మండల ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. మండలంలోని రైతులు, భూమి యజమానులు వారి స్థలాలను కోడి పందాలు, పేకాట, గుండాట, అశ్లీల నృత్యాలకు అనుమంతించరాదని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

క్షీరా రామలింగేశ్వరస్వామికి ద్రాక్షపండ్లతో అలంకరణ



పాలకొల్లు టౌన్, జనవరి 8 : పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు, పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామికి సోమవారం అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 150 కేజీలు ద్రాక్షపండ్లతో విశేషంగా అలంకరించారు. పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మెన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగస్త్యేశ్వరస్వామికి అభిషేక పూజలు

పోడూరు, జనవరి 8 : పెనుమదంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం సందర్భంగా ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ మంత్రోచ్ఛరణతో ముందుగా విఘ్నేశ్వరపూజతో ప్రారంభించి, అభిషేకాలు నిర్వహించారు, ఉమాబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఈవో పిల్లి సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజాధిరాజుగా అష్టభుజ లక్ష్మీనారాయణుడు



పాలకొల్లు టౌన్ : పాలకొల్లు చిన్నగోపురంలో అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 23వ రోజు సోమవారం స్వామిని రాజాధిరాజుగా అలంకరించారు. తిరుప్పావై పాశుర విశేషాలను పండితులు రంగనాథస్వామి భక్తులకు వివరించారు. దేవస్థానం ఛైర్మన్ జవ్వాజి పానకాలు, మెంబర్ మామిడి వెంకటేశ్వరావు, ఈవో పీటీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామ మందిర అక్షింతలు పంపిణీ



ఏఎస్పీ భీమారావుకు అక్షింతలు అందిస్తున్న వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు

పెనుమంట్ర/భీమవరం టౌన్ : అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి హిందూ ఇంటిలో అయోధ్య రాముని అక్షింతలు అందించి ఈనెల 22వ తేదీన ప్రతి ఇంటిలో దీపాలను వెలిగించాలని మహిళా భక్తులు కోరారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు హిందూ ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో పెనుమంట్ర మండలం పాలమూరులో ఇంటింటికి అక్షింతలను మహిళా భక్తులు పంపిణీ చేశారు. సీతారాముల రథంపై గ్రామోత్సవం నిర్వహిస్తూ అక్షింతలు అందజేశారు. భీమవరంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రీరాముని పూజ అక్షింతలను పంపిణీ, ఆహ్వాన పత్రాలను అందించారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు వబిలిశెట్టి శ్రీవేంకటేశర్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్, ఆర్డీవో శ్రీనివాసులురాజు, కె.రామానుజాచార్యులు, మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల సిబ్బందికి పంపిణీ చేశారు.